సాక్షి
నారాయణపేట

శుక్రవారం ၊ 12 ၊ జనవరి ၊ 2024



పూర్వవైభవం తెద్దాం

అలంపూర్ వైష్ణవాలయాలకు పూర్వవైభవం తెద్దామని రామానుజ జీయర్‌స్వామి అన్నారు.

వివరాలు 8లో ▸



అట్టహాసంగా..

పాలమూరులో సౌత్‌జోన్ నేషనల్ నెట్‌బాల్ పోటీలు అట్టహాసంగా ప్రారంభమయ్యాయి.

వివరాలు 8లో ▸

గరిష్టం/కనిష్టం 32.4/16.1

వాతావరణం

చలి ప్రభావం అధికంగా ఉంటుంది. విపరీతమైన మంచు కురుస్తుంది. ఉదయం, రాత్రివేళలో చల్లని గాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

జాతీయ స్థాయి షూటింగ్ బాల్ పోటీలకు విద్యార్థులు



బస్వంత్‌గౌడ్



శివమ్మ

మాగనూర్/ఊట్కూర్: జాతీయ స్థాయి జూనియర్ షూటింగ్ బాల్ క్రీడలకు ఊట్కూరు, మాగనూరు మండలం నేడరగంకు చెందిన విద్యార్థులు ఎంపికయ్యారు. మహబూబాబాద్ జిల్లా తొర్రూర్‌లో జరిగిన రాష్ట్రస్థాయి జూనియర్స్ షూటింగ్‌బాల్ క్రీడలలో నేడరగంకు చెందిన బస్వంత్‌గౌడ్, మక్తల్ జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న శివమ్మ పాల్గొని ప్రతిభ కనబర్చాడు. దీంతో వీరిని జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక చేసినట్లు రాష్ట్ర షూటింగ్ బాల్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు విశ్రాంత పీఈటీ గోపాలం ఒక ప్రకటనలో తెలిపారు. వీరు ఈ నెల 12 నుంచి 14వరకు ఏపీ రాష్ట్రం విజయవాడలో రాష్ట్రం తరపున పాల్గొననున్నట్లు తెలిపారు.

స్వల్పంగా పెరుగుతున్న కేసులు

పాలమూరు: జిల్లా జనరల్ ఆస్పత్రిలో గురువారం 96 మంది అనుమానితులకు ఆర్టీపీసీఆర్ పరీక్షలు నిర్వహించగా ఒకరికి పాజిటివ్ వచ్చింది. నారాయణపేటకు చెందిన మహిళకు కరోనా పాజిటివ్ రాగా స్వల్ప లక్షణాలు ఉన్నాయి. దీంతో ఆమెను హోం ఐసోలేషన్‌లో ఉంచి చికిత్స అందించనున్నారు. ఇక జిల్లా జనరల్ ఆస్పత్రిలో ఇప్పటి వరకు 1,233 మంది అనుమానితులకు ఆర్టీపీసీఆర్ పరీక్షలు నిర్వహించగా దీంట్లో 15మందికి కరోనా పాజిటివ్ వచ్చింది.


ఊరెళ్తున్నారా.. జాగ్రత్తలు తీసుకోండి

మహబూబ్‌నగర్ క్రైం: సంక్రాంతి పండుగ నేపథ్యంలో సొంత గ్రామాలకు, దూర ప్రాంతాలకు వెళ్తున్న వారు అప్రమత్తంగా ఉండటంతో పాటు ముందస్తుగా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఎస్పీ హర్షవర్ధన్ ఒక ప్రకటనలో తెలిపారు. కాలనీల్లో, ఇంటి పరిసరాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవడం మంచిదని సూచించారు. పండగ దృష్ట్యా చోరీలు జరగకుండా పోలీస్‌శాఖ నియంత్రణ చర్యలు చేపట్టామని, ప్రజలు కూడా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. విలువైన వస్తువులు ఇంట్లో పెట్టరాదని, వ్యక్తిగత ఆర్థిక విషయాలు ఇతరులకు ఏమాత్రం చెప్పరాదని పేర్కొన్నారు. హోమ్ సెక్యూరిటీ సిస్టమ్ ద్వారా ఇంటర్‌నెట్‌కు అనుసంధానం ఉన్న మీ ఫోన్ నుంచి మీ ఇంటిని చూసుకునే విధంగా ఏర్పాటు చేసుకోవాలన్నారు. అనుమానాస్పద, కొత్త వ్యక్తుల కదలికలపై డయల్ 100, మీ పరిధిలో ఉన్న పోలీస్‌స్టేషన్‌లో మీ వివరాలు చెప్పాడం వల్ల పోలీసులు నిఘా పెంచనున్నట్లు వివరించారు.

పోరు.. పైరవీల జోరు!

లోక్‌సభ ఎన్నికలపై ప్రధాన పార్టీల నజర్

- కమలం నుంచి మహబూబ్‌నగర్‌పై ముగ్గురి గురి
- డీకే అరుణ, జితేందర్‌రెడ్డి ముమ్మర ప్రయత్నాలు
- తనకే టికెట్ వస్తుందనే ధీమాలో శాంతికుమార్
- హస్తం అభ్యర్థులుగా వంశీచంద్‌రెడ్డి, మల్లురవి ఖరారు?
- బీఆర్‌ఎస్ అభ్యర్థులపై కొనసాగుతున్న ఉత్కంఠ
- తెరపైకి కొత్త పేర్లు.. వారంలో సస్పెన్స్ వీడే అవకాశం



సాక్షి ప్రతినిధి, మహబూబ్‌నగర్: లోక్‌సభ ఎన్నికలపై ప్రధాన రాజకీయ పార్టీలు కసరత్తు ప్రారంభించాయి. గెలుపే లక్ష్యంగా బలమైన అభ్యర్థులను బరిలో దించేందుకు కాంగ్రెస్, బీజేపీతో పాటు బీఆర్‌ఎస్ సన్నాహాలు మొదలుపెట్టాయి. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఘన విజయంతో కాంగ్రెస్‌లో.. ఇటీవల ఐదు రాష్ట్రాల్లో జరిగిన శాసనసభ ఎన్నికల్లో మూడింట గెలుపొందిన బీజేపీలో ఉత్సాహం తొణికిసలాడుతోంది. ఈ క్రమంలో ఆయా పార్టీలకు సంబంధించి పార్లమెంట్ బరిలో నిలిచేందుకు ఆశావహులు ఆసక్తి చూపుతున్నారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని రెండు లోక్‌సభ స్థానాల్లో (మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్)నూ టికెట్ ఆశిస్తున్న వారు ఇద్దరికి మించి ఉన్నారు. ఈ మేరకు వారు తమ తమ గాడ్‌ఫాదర్ల ద్వారా ప్రయత్నాలు ముమ్మరం చేసినట్లు తెలుస్తోంది. మరోవైపు అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి పాలైన బీఆర్‌ఎస్.. వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో గెలిచి సత్తా చాటాలని భావిస్తోంది. అయితే ఆ పార్టీలో నిరుత్సాహం అలుముకోగా.. ఎంపీ అభ్యర్థులు ఎవరనే దానిపై ఉత్కంఠ నెలకొంది.

అన్ని పార్టీలు.. ముమ్మర కసరత్తు

ఉమ్మడి మహబూబ్‌నగర్‌లోని 14 అసెంబ్లీ నియోజకవర్గాల్లో 12 స్థానాలను కాంగ్రెస్ కైవసం చేసుకున్న విషయం తెలిసిందే. ఇదే క్రమంలో రెండు పార్లమెంట్ స్థానాల్లోనూ విజయం సాధించాలనే లక్ష్యంతో కాంగ్రెస్ అధిష్టానం పక్కా వ్యూహంతో ముందుకు సాగుతోంది. ఉమ్మడి పాలమూరుకు చెందిన సీఎం రేవంత్ రెడ్డిని మహబూబ్‌నగర్ పార్లమెంట్ స్థానానికి కోఆర్డినేటర్‌గా నియమించడం ఇందుకు నిదర్శనం. అదేవిధంగా నాగర్‌కర్నూల్ లోక్‌సభ స్థానానికి మంత్రి జూపల్లి కృష్ణారావును కోఆర్డినేటర్‌గా నియమించింది. కాగా బీజేపీ మహబూబ్‌నగర్‌కు మాజీ ఎమ్మెల్సీ రామచంద్రారావు, నాగర్‌కర్నూల్‌కు మాజీ ఎమ్మెల్సీ రంగారెడ్డిని ఇన్‌చార్జీలుగా నియమించింది. బీఆర్‌ఎస్‌కు సంబంధించి ఇప్పటివరకు ఇన్‌చార్జీలను నియమించనప్పటికీ.. రాష్ట్రంలో పార్లమెంట్ నియోజకవర్గాల వారీగా ఎంపీ ఎన్నికల సన్నాహక సమావేశాలను నిర్వహిస్తోంది. ఈ మేరకు ఈ నెల 17న నాగర్‌కర్నూల్, 18న మహబూబ్‌నగర్ పార్లమెంట్ పరిధిలో సమావేశాలు నిర్వహించనుంది.

బీఆర్‌ఎస్‌లో అనిశ్చితి.. తెరపైకి కొత్త పేర్లు

ఉమ్మడి జిల్లాలోని రెండు ఎంపీ స్థానాల్లో అభ్యర్థులపై బీఆర్‌ఎస్‌లో స్తబ్దత కొనసాగుతోంది. అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి పాలైన నేపథ్యంలో పార్టీ శ్రేణుల్లో నిరుత్సాహం అలుముకోగా.. నేతల్లో అనిశ్చితి నెలకొంది. మహబూబ్‌నగర్ నుంచి ప్రస్తుతం ఎంపీగా బీఆర్‌ఎస్‌కు చెందిన మన్నె శ్రీనివాస్‌రెడ్డి కొనసాగుతున్నారు. మళ్లీ ఆయనకే టికెట్ కేటాయిస్తారా? మారిన రాజకీయ పరిణామాల క్రమంలో మారుస్తారా.. ఎమ్మెల్యేగా పోటీ చేసి ఓటమి పాలైన ముఖ్య నేతల్లో ఎవరికైనా అవకాశం కల్పిస్తా.. లేక కొత్త అభ్యర్థిని బరిలో నిలుపుతారా అనేది ప్రశ్నార్థకంగా మారింది.

మరోవైపు నాగర్‌కర్నూల్ నుంచి ప్రస్తుతం బీఆర్‌ఎస్‌కు చెందిన రాములు ఎంపీగా ఉన్నారు. ఆయనకు ఈ సారి అవకాశమిస్తారా అనేది చర్చనీయాంశంగా మారింది. ఎస్సీ రిజర్వ్‌గా ఉన్న ఈ స్థానం నుంచి ఎమ్మెల్సీ గోరటి వెంకన్న పేరు వినిపిస్తోంది. కాగా బీఆర్‌ఎస్ నుంచి ఎమ్మెల్యేగా పోటీ చేసి ఓడిపోయిన ఒకరు ఈ స్థానం నుంచి ఎంపీగా పోటీ చేసేందుకు ఆసక్తి చూపుతున్నా.. ఆ పార్టీ అధిష్టానం ఆయన పేరును పరిగణనలోకి కూడా తీసుకోనట్లు తెలిసింది. మరోవైపు నాగర్‌కర్నూల్ జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ పద్మావతి, ఆయన భర్త బంగారయ్య బీఆర్‌ఎస్ నుంచి ఎంపీగా పోటీచేసేందుకు ఆసక్తి చూపుతున్నారు. తమలో ఒకరికి అవకాశం ఇవ్వాలని పార్టీ అధిష్టానాన్ని కోరుతున్నారు. వచ్చే వారంలో జరిగే పార్లమెంట్ సన్నాహక సమావేశాల్లో బీఆర్‌ఎస్ అభ్యర్థులపై స్పష్టత వచ్చే అవకాశం ఉంది.

కాంగ్రెస్ అభ్యర్థులు ఫైనల్..

రాష్ట్రంలో అధికారంలోకి రావడమే కాకుండా ఉమ్మడి జిల్లాలో మెజార్టీ స్థానాలు సాధించిన క్రమంలో కాంగ్రెస్ శ్రేణుల్లో జోష్ నెలకొంది. ఎంపీ బరిలో నిలిచేందుకు ఆశావహులు భారీగా ఉన్నప్పటికీ.. రెండు ఎంపీ స్థానాల్లో అభ్యర్థులను దాదాపుగా ఖరారు చేసినట్లు ప్రచారం జరుగుతోంది. కాంగ్రెస్ అగ్రనేతలు సోనియాగాంధీ కుటుంబానికి విధేయులుగా ఉన్న చల్లా వంశీచంద్‌రెడ్డిని మహబూబ్‌నగర్, మల్లురవిని నాగర్‌కర్నూల్ నుంచి ఫైనల్ చేసినట్లు తెలుస్తోంది. వంశీచంద్‌రెడ్డి గతంలో కల్వకుర్తి ఎమ్మెల్యేగా పనిచేయడంతో పాటు మహబూబ్‌నగర్ నుంచి ఎంపీగా పోటీ చేసి ఓటమి పాలయ్యారు. ప్రస్తుతం ఆయన సీడబ్ల్యూసీ ప్రత్యేక ఆహ్వానితుడిగా పార్టీలో కీలక హోదాలో ఉన్నారు. సీనియర్ నాయకుడు మల్లురవి గతంలో ఎమ్మెల్యేగా, ఎంపీగా పని చేశారు. ఇదిలా ఉండగా మహబూబ్‌నగర్ ఎంపీ స్థానం నుంచి జడ్చర్లకు చెందిన ఓ ఇండస్ట్రియలిస్ట్ పేరు కూడా వినిపిస్తోంది. ప్రస్తుతం ఆయన బీఆర్‌ఎస్‌లో ఉన్నారు. కాంగ్రెస్‌లోకి వచ్చేందుకు ఆయన ఉత్సుకత చూపుతున్నప్పటికీ.. ఆ పార్టీ అధిష్టానం ఆచితూచి వ్యవహరిస్తోంది. కాగా, స్థానికులకే ఎంపీ టికెట్ కేటాయించాలని, ఇన్నాళ్లు డాక్టర్‌గా సేవ చేసిన తనకు అవకాశం ఇవ్వాలని నాగర్‌కర్నూల్‌కు చెందిన ఆ పార్టీ డాక్టర్స్ విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ మాణిక్యాల చెన్నయ్య గురువారం కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీని కలవడం చర్చనీయాంశంగా మారింది.

బీజేపీలో అంతర్గత పోరు.. తెరపైకి శాంతికుమార్

పాలమూరుపై బీజేపీ ప్రత్యేక దృష్టి సారించింది. ఆ పార్టీ జాతీయ కార్యవర్గ సభ్యుడు ఏపీ జితేందర్‌రెడ్డి, జాతీయ ఉపాధ్యక్షురాలు, మాజీ మంత్రి డీకే అరుణ.. వీరిద్దరూ ఇప్పటికే ఇక్కడి నుంచి పోటీచేయాలని భావిస్తుండగా.. అంతర్గత పోరు తారస్థాయికి చేరింది. ఈ క్రమంలో పార్టీ రాష్ట్ర కోశాధికారి శాంతికుమార్ సైతం బరిలో నిలిచేందుకు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. గత రెండు ఎన్నికల్లో పార్టీ అధిష్టానం తన పేరును పరిగణనలోకి తీసుకుందని.. చివరి నిమిషంలో ఇతరులకు టికెట్ కేటాయించిందని.. రెండుసార్లు టికెట్ త్యాగం చేసిన తనకు ఈ సారి కచ్చితంగా పోటీ చేసే అవకాశం కల్పిస్తుందని ఆయన ధీమా వ్యక్తం చేస్తున్నారు. అంతేకాదు పలు ప్రాంతాల్లో ప్రచారం సైతం ప్రారంభించినట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో ఎవరికి టికెట్ దక్కుతుందనే అంశం ఆ పార్టీలో హాట్‌టాపిక్‌గా మారింది. మరోవైపు నాగర్‌కర్నూల్ నుంచి గతంలో పోటీ చేసి ఓటమి పాలైన బంగారు శ్రుతికే మళ్లీ అవకాశం ఇవ్వనున్నట్లు తెలుస్తోంది.

అభివృద్ధి పనులకు ప్రతిపాదనలు సిద్ధం చేయండి



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీహర్ష

- మాస్టర్ ప్లాన్ తయారు చేయాలి
- కొడంగల్‌లో పరిశ్రమల ఏర్పాటుకు భూములు గుర్తించండి
- కలెక్టర్ శ్రీహర్ష

కోస్గి: ముఖ్యమంత్రి ప్రాతినిధ్యం వహిస్తున్న కొడంగల్ నియోజకవర్గంలో ప్రత్యేక అభివృద్ధి కోసం కొడంగల్ ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీ(కడా) ఏర్పాటు చేశారని, అధికారులు అభివృద్ధి పనులకు సంబందించి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని కలెక్టర్ శ్రీహర్ష సూచించారు. గురువారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో కడా ప్రత్యేక అధికారి వెంకట్‌రెడ్డితో కలిసి కోస్గి, మద్దూర్, గుండుమాల్, కొత్తపల్లి మండలాల తహసీల్దార్లు, ఎంపీడీఓలు, మున్సిపల్ కమిషనర్, ఇతర అధికారులతో అభివృద్ధి పనులకు సంబందించి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గతంలో అనుమతులు పొంది కొనసాగుతున్న అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. నియోజకవర్గ సమగ్ర అభివృద్ధికి మాస్టర్ ప్లాన్ తయారు చేయాలని సూచించారు. అనువైన పరిశ్రమలు ముఖ్యంగా వ్యవసాయ ఆధారిత పరిశ్రమలను స్థాపించడంతో పాటు విద్యా, వైద్య పరంగా అభివృద్ధి ఇతర మౌళిక సదుపాయాల కల్పనకు అవసరమైన ప్రభుత్వ భూములు గుర్తించాలన్నారు. రాష్ట్ర రాజధానికి మహబూబ్‌నగర్, నారాయణపేట, వికారాబాద్ జిల్లాలను అనుసంధానం చేస్తూ రోడ్ల వెడల్పుకు ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు. నియోజకవర్గంలో ఎలాంటి ఫిర్యాదులు వచ్చిన పరిష్కరించేందుకు అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. అనంతరం ప్రజా పాలన దరఖాస్తుల ఆన్‌లైన్ ప్రక్రియను పరిశీలించారు.

పాఠశాలలు, వసతి గృహాల్లో పరిశుభ్రత పాటించాలి

ప్రభుత్వ పాఠశాలలు, వసతి గృహాల్లో పరిశుభ్రత పాటించాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ మేరకు గుండుమాల్ మండల కేంద్రంలోని ఎస్సీ బాలుర వసతి గృహాన్ని, కోస్గిలోని బాలికల వసతి గృహాల్ని, కోస్గి జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలను తనిఖీ చేశారు. వసతి గృహాల్లో పారిశుద్ధ్యం పాటించకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యార్థులకు అందిస్తున్న భోజనాన్ని పరిశీలించి మెనూ ప్రకారం భోజనం అందించాలని సూచించారు. వంట గదుల్ని పరిశీలించారు. హాస్టళ్లలో విద్యార్థుల సంఖ్య, అందిస్తున్న భోజనం, వార్డెన్ల పనితీరు, ఇతర సమస్యలను విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. మరుగుదొడ్లు, మూత్ర శాలలు ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉంచాలని సిబ్బందికి సూచించారు. ఇందులో కడా ప్రత్యేక అధికారి వెంకట్ రెడ్డి, తహసీల్దార్ శ్రీనివాసులు, కమీషనర్ శశిధర్, ఆయా మండలాల తహసీల్దార్లు, డీఈలు, ఏఈలు ఉన్నారు.

రాజకీయాలు పక్కన పెట్టి సేవ చేస్తాం

మరికల్: రాజకీయాలను పక్కన పెట్టి పేద ప్రజల కోసం కాంగ్రెస్ పార్టీ సేవ చేస్తుందని ఎమ్మెల్యేలు వాకిటి శ్రీహరి, పర్ణికరెడ్డి అన్నారు. మండల కేంద్రంలో గురువారం అర్హులైన లబ్ధిదారులకు కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను వారు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రమాణస్వీకారం చేసిన వెంటనే ఆరు గ్యారెంటీల్లో రెండు పథకలను అమలు చేసిన ఘనత తమ పార్టీకే దక్కుతుందన్నారు. పెండింగ్‌లో ఉన్న కళ్యాణలక్ష్మి దరఖాస్తులను కూడా త్వరగా పరిష్కరించి వెంటనే పంపిణీ చేస్తామన్నారు. అలాగే అర్హులైన ప్రతి ఒక్కరికి ఆరు గ్యారంటీ పథకలను అమలు చేసి తీరుతామన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ సునిత, ఆర్‌ఐలు శ్రీశైలం, సుధాకార్‌రెడ్డి, సర్పంచులు గోవర్ధన్, రేవతమ్మ, దేవమ్మ, తిరుపతి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మరికల్‌లో కళ్యాణలక్ష్మి చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యేలు

పదో తరగతిలో మెరుగైన ఫలితాలు సాధించాలి



ఉర్దూ మీడియం పాఠశాలలో బోధనను పరిశీలిస్తున్న డీఈఓ ఘనీ

కోస్గి: రానున్న పదో తరగతి పరీక్షల్లో విద్యార్థులు మెరుగైన ఫలితాలు సాధించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని డీఈఓ అబ్దుల్ ఘని సూచించారు. గురువారం మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల, జెడ్పీ బాలికల, బాలుర, జెడ్పీ ఉర్దూ మీడియం పాఠశాలలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయా పాఠశాలల్లో పదో తరగతికి సంబందించి కొనసాగుతున్న తరగతుల్ని క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. విద్యార్థులతో కలిసి ఉపాధ్యాయుల పాఠాలు విన్నారు. చదువులో వెనకబడిన విద్యార్థుల పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని, అవసరమైతే ప్రత్యేక తరగతులు నిర్వహించాలని సూచించారు. అనంతరం మున్నూర్ వీధి, ఉర్దూ మీడియం ప్రాథమిక పాఠశాలలను సందర్శించి విద్యార్థుల విద్యా సామర్థ్యాలను పరిశీలించారు. ఇందులో ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు ఉన్నారు.

విద్యుత్ అధికారుల ముమ్మర తనిఖీలు

మాగనూర్: మండలంలోని పలు గ్రామాల్లోని ఇళ్లు, షాపులలో విద్యుత్ డిఈడిపి పాపారావు ఆధ్వర్యంలో గురువారం తనిఖీలు నిర్వహించారు. కొందరు వినియోగదారులు మీటర్‌లు అమర్చుకోకుండా ఉండటం, మరికొందరు మీటర్ ఉన్న కూడా అక్రమ కనెక్షన్‌లతో విద్యుత్ చౌర్యానికి పాల్పడుతున్నారని పాపారావు అన్నారు. దీంతో గురువారం 8 బృందాలతో ఏక కాలంలో దాడులు నిర్వహించి పలు కేసులు నమోదు చేయడం జరిగిందన్నారు. విద్యుత్ చౌర్యానికి పాల్పడుతూ ట్రాన్స్ ఆదాయానికి గండి కొడుతున్నారని, అట్టి వారిపై కేసులు నమోదు చేస్తామని తెలిపారు. మొదటి సారి జరిమానాలతో విధించడం జరుగుతుందని, రెండో సారి జైలు శిక్షతో పాటుగా జరిమానా కూడా విధిస్తారని అన్నారు. కార్యక్రమంలో ఏడి లక్ష్మీనారాయణ, ఏఈ దేవెంద్ర తదితరులు పాల్గొన్నారు.



మాగనూర్‌లో తనిఖీలు నిర్వహిస్తున్న అధికారులు

ఆలయాల అభివృద్ధికి కృషి



ఎక్లాస్‌పూర్ ఆలయంలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే చిట్టెం పర్ణికారెడ్డి

నారాయణపేట రూరల్: నియోజకవర్గంలోని దేవాదాయశాఖ పరిధిలోని ఆలయాలను ప్రభుత్వ సహకారంతో అభివృద్ధి చేస్తానని ఎమ్మెల్యే చిట్టెం పర్ణికారెడ్డి అన్నారు. మండలంలోని ఎక్లాస్‌పూర్ తిమ్మప్పస్వామి ఆయంలో ఆమె గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. ఆలయ నిర్మాణ పనులు, ఇతర సౌకర్యాల విషయంలో తనవంతు సహకారం అందిస్తానని చెప్పారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షులు సదాశివరెడ్డి, శరణప్ప, ఊషప్ప, జమునాబాయి, ఆనంద్, అఖిల్, సందీప్‌రెడ్డి పాల్గొన్నారు. అలాగే, పట్టణంలోని పీహెచ్‌ఎస్ పాఠశాలకు సొంత భవనం ఏర్పాటు చేసేందుకు తనవంతు కృషి చేస్తానని అన్నారు. రేవంత్ యువసేనా నాయకులు యూసఫ్‌తాజ్ పాఠశాల విద్యార్థులకు ఉచితంగా నోటుపుస్తకాలు, ప్యాడ్, పెన్నులను ఎమ్మెల్యే చేతుల మీదుగా అందించారు. ఈ సందర్భంగా ఆ పాఠశాల యాజమాన్యకమిటి సభ్యులు, టీచర్లు అద్దె భవనంలోని ఇబ్బందులను ఎమ్మెల్యే దృష్టికి తీసుకుని వచ్చారు. సొంత భవనం కావాలని వినతిపత్రం అందించారు.

ఎట్టకేలకు మోక్షం

- మినీ అంగన్‌వాడీలు ప్రధాన అంగన్‌వాడీ కేంద్రాలుగా అప్‌గ్రేడ్
- చిన్నారులకు అందనున్న పౌష్టికాహారం
- బాలింతలు, గర్భిణులకు మరిన్ని సేవలు
- జిల్లాలో 55 మినీ అంగన్‌వాడీ కేంద్రాలు



గుండ్యానాయక్ తండాలోని మినీ అంగన్‌వాడీ కేంద్రం

మద్దూరు: మినీ అంగన్‌వాడీ కేంద్రాలకు ఎట్టకేలకు మోక్షం లభించింది. జిల్లాలోని మినీ అంగన్‌వాడీ కేంద్రాలను ప్రధాన అంగన్‌వాడీ కేంద్రాలుగా మార్చేందుకు ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. నూతనంగా కాంగ్రెస్ ప్రభుత్వంలో పంచాయతీ రాజ్, గ్రామీణ అభివృద్ధి శిశు సంక్షేమశాఖ మంత్రి ధనసరి సీతక్క మినీ అంగన్‌వాడీ కేంద్రాలను ప్రధాన అంగన్‌వాడీ కేంద్రాలుగా అప్‌గ్రేడ్ చేస్తూ ఇటీవల సంతకం చేసింది. దీంతో చిన్న గ్రామాల్లో, తండాలోని మినీ అంగన్‌వాడీ కేంద్రాలు ఇక నుంచి ప్రధాన అంగన్‌వాడీ కేంద్రాలుగా కొనసాగనున్నాయి. గతంలో వెయ్యి మంది జనాభా ఉన్న ప్రాంతానికి ఒక అంగన్‌వాడీ కేంద్రాన్ని ఏర్పాటు చేసి లబ్ధిదారులకు పలు రకాల సౌకర్యాలు అందిస్తున్నాయి. వెయ్యి లోపు జనాభా ఉండి, ప్రధాన కేంద్రాలకు దూరంగా ఉన్న అవాస గ్రామాలు శివారు కాలనీ ప్రజల ఇబ్బందులు గుర్తించిన ప్రభుత్వం ఆయా ప్రాంతాల్లో 2014 వరకు మినీ అంగన్‌వాడీ కేంద్రాలను ఏర్పాటు చేసింది. అయితే ఆయా కేంద్రాల్లో ఒక్క ఉపాధ్యాయురాలు మాత్రమే అన్ని విధులు నిర్వహించాల్సి రావటంతో నాణ్యమైన సేవలు అందించడం కష్టంగా మారింది. ఆయా కేంద్రాల స్థాయి పెంచేందుకు ప్రతిపాదనలు గత ప్రభుత్వంలో తయారు చేసినప్పటికీ ప్రధాన కేంద్రాలుగా మార్పు మాత్రం కాంగ్రెస్ ప్రభుత్వంతో జరుగడం సంతోషకరమని టీచర్లు అనందాన్ని వ్యక్తం చేస్తున్నారు.

సేవలు మెరుగు..

జిల్లాలోని అన్ని మినీ అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రధాన కేంద్రాలతో సమానంగా సేవలు అందిస్తున్నారు. మినీ అంగన్‌వాడీ కేంద్రాల్లో ఇద్దరు చేయాల్సిన పని ఒక్కరే చేయాల్సి రావడంతో నాణ్యమైన సేవలు అందటంలేదు. దీన్ని దృష్టిలో ఉంచుకుని వెయ్యి మంది జనాభా ఉన్న కేంద్రాల స్థాయి పెంచేందుకు ప్రభుత్వం సిద్ధమైంది. జిల్లాలో 55 మినీ అంగన్‌వాడీ కేంద్రాలు ఉండగా అందులో పక్కా భవనాలు కూడా కరువయ్యాయి. వాటిలోనే టీచర్లు విద్యార్థులకు బోధన, భోజనం, బాలింతలు, గర్భిణులకు సేవలను అందిస్తూ వస్తున్నారు.

మరికొంత మందికి ఉపాధి..

అంగన్‌వాడీ కేంద్రాలు చిన్నారుల విద్యకు.. ఆరోగ్యానికి పునాదులుగా ఉపయోగపడనున్నాయి. అంగన్‌వాడీ కేంద్రంలో 0–6 వరకు పిల్లలకు కోడి గుడ్లు, పాలు, భోజనం అందిస్తారు. అలాగే బాలింతలకు కూడా పౌష్టికాహారాన్ని ఇస్తుంటారు. ప్రధాన అంగన్‌వాడీ కేంద్రంలో టీచర్, ఒక ఆయా ఉండడంతో చిన్నారులను తీసుకురావడం, పంపించడం, ఇతర సమాచారాన్ని చేరవేసే వెసులుబాటు ఉంటుంది. కానీ మినీ అంగన్‌వాడీ కేంద్రంలో ఒకే టీచర్ ఉండడం మూలంగా పూర్తి స్థాయిలో సేవలు అందడం లేదని ప్రభుత్వం బావించి ప్రధాన కేంద్రాల మార్పునకు శ్రీకారం చుట్టారు. దీంతో మినీ కాస్త ప్రధాన కేంద్రాలు కావడంతో ఇప్పుడు టీచర్లు ఉన్న కేంద్రాలకు అదనంగా ఆయాలను కూడా భర్తీ చేయడంతో మరికొంత మంది మహిళలకు ఉపాధి లభించే అవకాశాలు ఉన్నాయి.

అనందంగా ఉంది



మినీ అంగన్‌వాడీ కేంద్రంలో ఒక్క దాన్నే విధులు నిర్వహించాల్సి వస్తుంది. దీంతో ఎక్కడికైన వెళ్లాల్సి వస్తే అంగన్‌వాడీ మూతపడేది. అప్‌గ్రేడ్ కావడంతో ఆయా పోస్టు వస్తుంది. మరింత మెరుగైన సేవలు అందించగలుగుతాం. – సీతాబాయి, దేన్యానాయక్ తండా, మద్దూరు ప్రాజెక్టు

మరింత మెరుగ్గా సేవలు



మినీ అంగన్‌వాడీ కేంద్రాలు ప్రధాన అంగన్‌వాడీ కేంద్రాలుగా మారడంతో లబ్ధిదారులకు సేవలు మరింత సులభం కానున్నాయి. టీచర్‌తో పాటు, ఆయాలు కూడా ఉండడం వల్ల నిర్వహణ మరింత మెరుగుపడుతుంది. నిత్యం పర్యవేక్షణ చేస్తూ నాణ్యమైన పౌష్టికాహారం ఇచ్చే విధంగా చూస్తాం.

– వేణుగోపాల్, డీడబ్ల్యూఓ, నారాయణపేట

జిల్లా వివరాలిలా..	ఐసీడీఎస్ ప్రాజెక్టులు	ప్రధాన అంగన్‌వాడీ కేంద్రాలు	మినీ అంగన్‌వాడీ కేంద్రాలు	గర్భిణులు	బాలింతలు	చిన్నారులు(7 నెలల నుంచి3 ఏళ్లు)	3 ఏళ్ల నుంచి 6 ఏళ్ల వరకు
	3.. మద్దూరు, మక్తల్, నారాయణపేట	649	55	4,890	4,597	21,549	13,391

పురపాలికల్లో అభివృద్ధి వేగవంతం

- తాగునీరు, పారుశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలి
- మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ డిప్యూటీ డైరెక్టర్ శ్రీధర్



అమరచింతలో దరఖాస్తుల నమోదు ప్రక్రియను పరిశీలిస్తున్న శ్రీధర్

ఆత్మకూర్/అమరచింత: పురపాలికల్లో అభివృద్ధి కార్యక్రమాలను వేగవంతం చేసినట్లు మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ డిప్యూటీ డైరెక్టర్ శ్రీధర్ అన్నారు. గురువారం ఆత్మకూర్, అమరచింత మున్సిపల్ కార్యాలయాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ప్రజాపాలన దరఖాస్తుల ఆన్‌లైన్ నమోదు ప్రక్రియతో పాటు పట్టణప్రకృతి వనం, క్రీడామైదానాలను పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజాపాలన కార్యక్రమంలో వచ్చిన ప్రతి దరఖాస్తును ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని సిబ్బందికి సూచించారు. అమరచింతలో ఇప్పటికే పూర్తి స్థాయిలో దరఖాస్తులను నమోదు చేయడం అభినందనీయమన్నారు. స్వచ్ఛ సర్వేక్షన్‌లో ఆత్మకూర్ మున్సిపాలిటీకీ జాతీయ స్థాయి గ్రేడ్ రావడంపై అభినందనలు తెలిపారు. ఇదే ఉత్సాహంతో ముందుకుసాగాలని సూచించారు. పారుశుద్ధ్యం నిర్వహణ, తాగునీటి సరఫరాలో ఎలాంటి అవంతరాలు తలెత్తకుండా చూడాలన్నారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్‌పర్సన్స్ గాయత్రి, మంగమ్మ, వైస్ చైర్మన్ విజయభాస్కర్‌రెడ్డి, కమిషనర్లు నాగరాజు, మహమ్మద్ ఖాజా, కౌన్సిలర్లు డిప్యూటీ డైరెక్టర్ శ్రీధర్‌ను పూలమాల, శాలువాతో సత్కరించారు.

క్లుప్తంగా

బావిలో పడి కౌలురైతు మృతి


నాగరాజు (ఫైల్)

పాన్‌గల్: ప్రమాదవశాత్తు బావిలో పడి కౌలురైతు మృతిచెందిన ఘటన పాన్‌గల్ మండలం రేమద్దులలో గురువారం చోటుచేసుకుంది. ఎస్‌ఐ వేణు వివరాల మేరకు.. రేమద్దులకు చెందిన నాగరాజు (39) అదే గ్రామానికి చెందిన దయాకర్ పొలాన్ని కౌలుకు తీసుకుని వరిసాగు చేస్తున్నాడు. బుధవారం నాట్లు వేసేందుకు కరిగెట చేసిన అనంతరం సమీపంలోని బావిలో బట్టలు ఉతికేందుకు వెళ్లి ప్రమాదవశాత్తు నీటిలో పడిపోయాడు. అతడు ఎంతకూ ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు వ్యవసాయ పొలానికి వెళ్లి గాలించారు. బావి గట్టుపై బట్టలు, చెప్పులు, సెల్‌ఫోన్ కనిపించాయి. గురువారం బావిలో నుంచి నాగరాజు మృతదేహాన్ని బయటికి తీశారు. మృతుడి భార్య జ్యోతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జిల్లా మార్చురీకి తరలించినట్లు ఎస్‌ఐ తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో రైతు దుర్మరణం

జడ్చర్ల: బాదేపల్లి వ్యవసాయ మార్కెట్ యార్డులో ధాన్యం విక్రయించి, స్వగ్రామానికి వెళ్తున్న ఓ రైతును గుర్తుతెలియని వాహనం ఢీకొట్టడంతో దుర్మరణం చెందాడు. ఈ ఘటన జడ్చర్ల మండలం కుర్వగడ్డపల్లి శివారులో బుధవారం రాత్రి చోటుచేసుకుంది. ఎస్‌ఐ చంద్రమోహన్ వివరాల మేరకు.. మండలంలోని నెక్కొండకు చెందిన కమ్మరి నర్సింహులు (59) పండించిన ధాన్యాన్ని బాదేపల్లి వ్యవసాయ మార్కెట్‌లో విక్రయించి, రాత్రి 11గంటల సమయంలో బైక్‌పై స్వగ్రామానికి వెళ్తుండగా.. కుర్వగడ్డపల్లి సమీపంలో జడ్చర్ల నుంచి కల్వకుర్తివైపు వెళ్తున్న గుర్తుతెలియని వాహనం ఢీకొట్టింది. ప్రమాదంలో అతడికి తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి కుమారుడు శివప్రసాద్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

శతాధిక వృద్ధురాలి మృతి


వెంకటరామమ్మ (ఫైల్)

తాడూరు: మండలంలోని సిర్సవాడ కాలనీకి చెందిన శతాధిక వృద్ధురాలు గంటా వెంకట్రామమ్మ(106) అనారోగ్యంతో గురువారం మృతిచెందింది. మృతురాలికి ఏడుగురు కుమారులు, కుమార్తె ఉన్నారు. నాలుగు తరాలుగా ఇంటిని పోషించిన ఆమె మరణాన్ని కుటుంబ సభ్యులు తట్టుకోలేకపోయారు.

పోక్సో కేసులో యువకుడి రిమాండ్

గోపాల్‌పేట: రేవల్లి మండలంలోని ఓ గ్రామానికి చెందిన యువకుడిని పోక్సో కేసులో రిమాండ్ చేసినట్లు ఎస్‌ఐ శివకుమార్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. రేవల్లి మండలంలో ఓ గ్రామానికి చెందిన బాలికను మోసం చేసి హైదరాబాద్ తీసుకెళ్లాడు. డిసెంబర్ 16న రేవల్లి మండల పీఎస్‌లో కేసు నమోదు కాగా యువకుడిని పట్టుకుని గురువారం రిమాండ్‌కు తరలించామని వివరించారు.

మరో యువకుడిపై..

కోస్గి: మున్సిపాలిటీకి చెందిన బాబు అనే యువకుడిపై పోక్సో కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ శ్రీనివాసులు తెలిపారు. ఓ మైనర్ బాలికకు మాయమాటలు చెప్పి ఈనెల 3న వివాహం చేసుకున్నాడని పేర్కొన్నారు. బాలిక తల్లి ఫిర్యాదు మేరకు పోక్సో కేసు నమోదు చేసి.. కోర్టులో హాజరుపర్చగా, రిమాండ్‌కు తరలించినట్లు ఎస్‌ఐ తెలిపారు.

రేషన్‌బియ్యం పట్టివేత

నారాయణపేట రూరల్: టాస్క్‌ఫోర్స్ దాడుల్లో 16 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టుబడింది. ఎస్‌ఐ విజయ్‌కుమార్ వివరాల మేరకు.. జిల్లా కేంద్రంలోని యాద్గీర్‌రోడ్‌లో కర్ణాటక రాష్ట్రం గుల్బర్గకు చెందిన భీమప్ప రేకుల షెడ్డులో 16 క్వింటాళ్ల రేషన్ బియ్యం నిల్వ చేయగా.. టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడులు నిర్వహించి పట్టుకున్నారు. దాడులు నిర్వహించారు. ఆర్‌ఐ కాలప్ప పంచనామా అనంతరం భీమప్పపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

మెడికల్ కళాశాలలకు ప్రిన్సిపాళ్ల నియామకం

పాలమూరు: రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా ఏర్పాటు అయిన రెండు మెడికల్ కళాశాలకు నూతన ప్రిన్సిపాళ్లను నియామకం చేస్తూ గురువారం రాత్రి డీఎంఈ త్రివేణి ఉత్తర్వులు జారీ చేసింది. నారాయణపేట ప్రభుత్వ మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్‌గా డాక్టర్ రామకిషన్, జోగుళాంబ గద్వాల ప్రభుత్వ మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్‌గా డాక్టర్ నవ కల్యాణిలను నియమించారు. ప్రస్తుతం రామకిషన్ మహబూబ్‌నగర్ జిల్లా జనరల్ ఆస్పత్రి అర్థో హెచ్‌ఓడీగా విధులు నిర్వహిస్తున్నారు. ఆయన గతంలో జనరల్ ఆస్పత్రి సూపరింటెండెంట్‌గా కూడా పని చేశారు. అదేవిధంగా డాక్టర్ నవకల్యాణి పాలమూరు మెడికల్ కళాశాలలో అనాటమీ విభాగం హెచ్‌ఓడీగా పని చేస్తున్నారు. ఆమె గతంలో పాలమూరు మెడికల్ కళాశాలకు కొన్ని రోజులు ఇన్‌చార్జి ప్రిన్సిపాల్‌గా పని చేయడం విశేషం.

అట్టహాసంగా..


పోటీలో తలపడుతున్న తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ పురుషుల జట్లు

- ఫాస్ట్–5 సౌత్‌జోన్ నెట్‌బాల్ చాంపియన్‌షిప్ ప్రారంభం
- ఆరు రాష్ట్రాల పురుష, మహిళా జట్ల హాజరు
- శుభారంభం చేసిన తెలంగాణ పురుషుల జట్టు



మాట్లాడుతున్న డీవైఎస్‌ఓ శ్రీనివాస్

మహబూబ్‌నగర్ క్రీడలు: మహబూబ్‌నగర్ మెయిన్ స్టేడియంలోని మల్టీపర్పస్ ఇండోర్‌లో మొదటి ఫాస్ట్–5 సౌత్‌జోన్ నేషనల్ నెట్‌బాల్ పోటీలు గురువారం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. పోటీలకు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కేరళ, తమిళనాడు, కర్ణాటక, పుదుచ్చేరి రాష్ట్రాల పురుషుల, మహిళా జట్లు తరలివచ్చాయి. ఇండోర్ స్టేడియంలో రెండు కోర్టులు ఏర్పాటు చేసి, మ్యాచ్‌లు నిర్వహిస్తున్నారు. మొదటి రోజు తెలంగాణ పురుషుల జట్టు శుభారంభం చేసింది. తెలంగాణ జట్టు 16–5 గోల్స్ తేడాతో ఆంధ్రప్రదేశ్ జట్టుపై విజయం సాధించింది. పురుషుల విభాగం మ్యాచుల్లో కేరళ జట్టు 29–12 గోల్స్ తేడాతో పుదుచ్చేరి జట్టుపై, కర్ణాటక జట్టు 38–4 గోల్స్ తేడాతో ఆంధ్రప్రదేశ్‌పై, కేరళ జట్టు 32–7 గోల్స్ తేడాతో తమిళనాడుపై గెలుపొందాయి. మహిళా విభాగం మ్యాచుల్లో కర్ణాటక జట్టు 39–2 గోల్స్ తేడాతో ఆంధ్రప్రదేశ్ జట్టుపై, మరో మ్యాచ్‌లో కేరళ జట్టు 22–13 గోల్స్ తేడాతో పుదుచ్చేరిపై, పుదుచ్చేరి జట్టు 25–21 గోల్స్ తేడాతో తమిళనాడుపై, కేరళ జట్టు 18–2 గోల్స్ తేడాతో ఆంధ్రప్రదేశ్ జట్టుపై గెలుపొందాయి.

నిరంతర సాధనతోనే ఉన్నత స్థానం: డీవైఎస్‌ఓ

నిరంతర సాధనతోనే క్రీడల్లో ఉన్నతస్థానాలకు ఎదగవచ్చని జిల్లా యువజన, క్రీడల అధికారి ఎస్.శ్రీనివాస్ అన్నారు. నెట్‌బాల్ పోటీల ప్రారంభోత్సవంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ.. క్రీడల్లో రాణించే వారికి ఉజ్వల భవిష్యత్ ఉంటుందన్నారు. క్రీడాకోటాలో ఉద్యోగ అవకాశాలు ఉంటాయన్నారు. జిల్లా కేంద్రంలో సౌత్‌జోన్, నేషనల్ నెట్‌బాల్ చాంపియన్‌షిప్ నిర్వహిస్తుండటం సంతోషంగా ఉందన్నారు. ఆయా రాష్ట్రాల జట్లు ఈ టోర్నీలో ప్రతిభ చాటాలని పిలుపునిచ్చారు. నెట్‌బాల్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఉపాధ్యక్షుడు గిరీష్ సిగొడ మాట్లాడుతూ తెలంగాణలో ఫాస్ట్–5 నెట్‌బాల్, నేషనల్ టోర్నీలు మొదటిసారిగా మల్టీపర్పస్ ఇండోర్ స్టేడియంలో నిర్వహిస్తుండటం అభినందనీయమని అన్నారు. క్రీడాకారులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని ఏర్పాట్లు చేయాలని సూచించారు. కార్యక్రమంలో నెట్‌బాల్ అసోసియేషన్ ఆఫ్ తెలంగాణ అధ్యక్షుడు విక్రం ఆదిత్యరెడ్డి, ప్రధాన కార్యదర్శి ఖాజాఖాన్, ఉపాధ్యక్షుడు సాదత్‌ఖాన్, కోశాధికారి సోహైల్ ఉర్ రహెమాన్, రామ్మోహన్‌గౌడ్, అంజద్, షకీల్, అక్రం పాల్గొన్నారు.

యోగనారసింహ ఆలయానికి పూర్వవైభవం తెద్దాం


జోగుళాంబ ఆలయంలో శిష్యబృందంతో స్వామిజీవారు

- అష్టాక్షరి పీఠం త్రిదండి సంపత్‌కుమార రామానుజ జీయర్‌స్వామి

జోగుళాంబ శక్తిపీఠం: అలంపూర్ పుణ్యక్షేత్రంలో కొలువైన అనేక వైష్ణవాలయాలు అంధకారంలో మగ్గుతున్నాయని, వాటికి పూర్వవైభవం తీసుకొద్దామని అష్టాక్షరిపీఠం త్రిదండి సంపత్‌కుమార రామానుజ జీయర్‌స్వామి అన్నారు. గురువారం జోగుళాంబ, బాలబ్రహ్మేశ్వర స్వామి ఆలయాలను శిష్యబృందంతో కలిసి దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ చైర్మన్ చిన్నకృష్ణయ్య, ప్రధాన అర్చకులు ఆనంద్‌శర్మ, పాలక మండలి సభ్యులు వెంకటేశ్వరరెడ్డి వారికి పూర్ణకుంభంతో ఘన స్వాగతం పలికారు. ముందుగా జోగుళాంబ, బాలబ్రహ్మేశ్వర స్వామివార్లను దర్శించుకొని ప్రత్యేక పూజలు చేసి.. భక్తులకు అనుగ్రహ భాషణ చేసి మంగళశాసనాలు అందించారు. అనంతరం యోగనారసింహస్వామి ఆలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆలయాలు ఎంతో అద్భుతంగా ఉన్నాయని ఇక్కడి ప్రశాంత వాతవరణం, ప్రకృతి రమణీయత భక్తులను మంత్రముగ్ధులను చేస్తుందన్నారు. ఆలయాలపై భక్తులకు ప్రచారం కల్పించాలని సూచించారు. ఆలయాల్లో జరిగే ఆగమాలు, పూజా విధానాలను తెలుసుకున్నారు. ఆలయాల అభివృద్ధి కోసం త్వరలోనే ప్రభుత్వాన్ని కలుస్తామని చెప్పారు. కర్నూలు గోదాగోకుల ట్రస్టు మారం నాగరాజుగుప్తా, నాగరాజు, కృష్ణమోహన్, రంగనాథాచార్యులు తదితరులు పాల్గొన్నారు.

కురుమూర్తి గుట్టలో భక్తుల రద్దీ



చిన్నచింతకుంట: అమ్మాపురం కురుమూర్తి స్వామిని అమావాస్యను పురస్కరించుకుని గురువారం భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చారు. ఆలయ అర్చకులు సుప్రభాత సేవ నిర్వహించిన అనంతరం భక్తులకు దర్శనం కల్పించారు. ఉమ్మడి జిల్లా నుంచి భక్తులు ఉదయం నుంచే తరలివచ్చి క్యూలైన్‌లో నిల్చున్నారు. తల స్నానాలు ఆచరించి తడిగుడ్డలతో మెట్లపై దీపాలు వెలిగిస్తూ గోవింద నామస్మరణలతో స్వామి చెంతకు చేరారు. కొందరు భక్తులు తలనీలాలు సమర్పించారు. కొండ దిగువన మట్టికుండలో పచ్చిపులుసు అన్నం నైవేద్యంగా తయారు చేసి స్వామికి సమర్పించి వేడుకున్నారు. అనంతరం కొండపైన అలివేలు మంగమ్మ, చెన్నకేశవస్వామి, ఆంజనేయ స్వామి, ఉద్దాల మండపం వద్ద భక్తులు పూజలు చేశారు. ఆలయ ప్రాంగణంతో పాటు జాతర మైదానం భక్తుల రద్దీతో కిటకిటలాడింది.

ఆయిల్‌పాంపై అవగాహన కల్పించాలి


కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యేలు పర్ణికారెడ్డి, వాకిటి శ్రీహరి

మరికల్: ఆయిల్‌పాం సాగు విషయంలో రైతులకు వచ్చిన సమస్యలపై పూర్తిస్థాయిలో అవగాహన కల్పించాలని నారాయణపేట ఎమ్మెల్యే పర్ణికారెడ్డి, మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి అన్నారు. మండల కేంద్రంలోని గురువారం ఆయిల్‌పామ్ గెలల కొనుగోలు కేంద్రాన్ని వారు ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ.. జిల్లాలో ఐదేళ్ల నుంచి ఆయిల్‌పాం సాగవుతుందని, ఈ పంటపై రైతులకు అనేక సందేహాలు ఉన్నాయన్నారు. రైతులను నష్టాల్లో నెట్టకుండా సాగు ఎలా చేయాలి, యాజామన్య పద్ధతులు పంట దిగుబడి ఎప్పుడు వస్తుందనే విషయలపై పూర్తిగా అవగాహన కల్పించాల్సిన బాధ్యత ఆయిల్‌ఫెడ్ అధికారులపై ఉందన్నారు. క్షేత్రస్థాయిలో ఎప్పటికప్పుడు పంటలను పరిశీలించి సాగు విధానంపై తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సలహాలు, సూచనలు ఇస్తేనే రైతులు సాగు చేసేందుకు ముందుకు వస్తారన్నారు. క్షేత్రస్థాయిలో అధికారులు పంటలను పరిశీలన చేయకపోవడంతో రైతులు వారిపై అసంతృప్తి వ్యక్తం చేశారు.

అధికారుల చేతిలో బీఆర్‌ఎస్ పార్టీ డైరీ

ఆయిల్‌పాం గెలల కొనుగోలు కేంద్రం ప్రారంభ కార్యక్రమానికి ఆయిల్‌ఫెడ్ అధికారుల చేతుల్లో బీఆర్‌ఎస్ పార్టీ డైరీ ఉండటంతో కాంగ్రెస్ నాయకులు వారితో వాగ్వాదానికి దిగారు. ఇలాంటి పొరపాట్లు మరోసారి పునరావృతం కాకుండా చూడాలని ఎమ్మెల్యేలు అధికారులను హెచ్చరించారు. కార్యక్రమంలో సర్పంచ్ గోవర్దన్, ఎంపీటీసీ గోపాల్, ఆయిల్‌ఫెడ్ అధికారులు సుధాకర్‌రెడ్డి, మొహ్మద్ మోహిన్, ఖాదిర్, బాల్‌రాజ్, రాధాకృష్ణ, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

దుష్ప్రచారాలను నమ్మకండి..

- హిందూ ధార్మిక సేన రాష్ట్ర అధ్యక్షుడు రాజశేఖర్ శర్మ



జోగుళాంబ శక్తిపీఠం: సంక్రాంతికి కీడు వచ్చిందని ఇద్దరు కొడుకులున్న తల్లులు, ఒక్క కొడుకున్న వారికి గాజులు కొనివ్వాలని కొత్త అల్లుడిని పిలిచి పాలతో కాళ్లు కడగాలని చేస్తున్న దుష్ప్రచారాలను ఎవరూ నమ్మరాదని హిందూ ధార్మిక సేన రాష్ట్ర అధ్యక్షుడు రాజశేఖర్ శర్మ కోరారు. ఇలాంటి అసత్య ప్రచారాలను ఎవరూ నమ్మరాదని అన్నారు. ఎప్పటిలాగే వారి కుటుంబ పద్ధతుల ప్రకారం పండుగ సందర్భంగా ముత్తయిదువులకు గాజులు, చీరలు, పసుపు కుంకుమ, వంటి మంగళద్రవ్యాలను ఇస్తూ సాంప్రదాయాలను పాటించి పండుగలను ఆనందంగా జరుపుకోవాలన్నారు. సంక్రాంతికి కీడు వచ్చిందనే దుష్ప్రచారాలను ఎవరూ నమ్మరాదని ఈ విషయంలో ప్రజలను ఎప్పటికప్పుడు జాగృతం చేసేందుకు హిందూ ధార్మిక సేన అవిశ్రాంత కృషి చేస్తుందన్నారు.

జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక


విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

జడ్చర్ల: హ్యాండ్ బాల్ జాతీయ స్థాయి పోటీలకు మండలంలోని కోడ్గల్ జెడ్పీహెచ్‌ఎస్ విద్యార్థులు ఎంపికై నట్లు పీఈటీ శంకర్‌నాయక్ తెలిపారు. ఇటీవల 67వ ఎస్‌జీఎఫ్ హ్యాండ్‌బాల్ అండర్–17 రాష్ట్రస్థాయి పోటీలలో తమ విద్యార్థులు విజేతలుగా నిలిచి జాతీయ స్థాయికి ఎంపికై నట్లు పేర్కొన్నారు. బాలికల విభాగంలో నందిని, బాలుర విభాగంలో సక్కురాం ఉన్నారు. ఈనెల 16 నుంచి 21 వరకు మహబూబ్‌నగర్, మధ్యప్రదేశ్‌లో జరిగే జాతీయ స్థాయి పోటీలలో పాల్గొంటారని తెలిపారు. విద్యార్థులను హెచ్‌ఎం శ్రీనివాసులు తదితరులు అభినందించారు.

12న ఎంపికలు

ఈనెల 12న ఉమ్మడి జిల్లా హ్యాండ్‌బాల్ జూనియర్ బాలికల ఎంపికలు కోడ్గల్ జెడ్పీహెచ్‌ఎస్ ఆవరణలో నిర్వహిస్తున్నట్లు హ్యాండ్‌బాల్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి శంకరఖ్‌నాయక్ తెలిపారు. వివరాలకు 9398921626 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

దాడి ఘటనలో వైస్ ఎంపీపీకి రిమాండ్

బల్మూర్: భూవివాదం నేపథ్యంలో ఓ వ్యక్తిపై దాడి చేసిన ఘటనలో వైస్ ఎంపీపీతో పాటు 11 మందిని గురువారం రిమాండ్‌కు తరలించినట్లు ఎస్‌ఐ శేఖర్‌రెడ్డి తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని గట్టుతుమ్మెన్, మహాదేవ్‌పూర్ గ్రామాల శివార్లలో భూమి పంచాయితీ విషయంలో గతేడాది రజనికాంత్‌రెడ్డి అనే వ్యక్తిపై వైస్ ఎంపీపీ నారాయణతో పాటు 11 మంది దాడి చేసి చెయ్యి విరగొట్టారు. ఈ ఘటనపై గురువారం నిందితులను అరెస్ట్ చేసి కోర్టులో ప్రవేశపెట్టగా జడ్జీ వారికి రిమాండ్ విధించారని ఎస్‌ఐ పేర్కొన్నారు.

ఎస్‌జీఎఫ్ జాతీయ క్రికెట్ పోటీలకు మోసెస్‌రాజ్



మహబూబ్‌నగర్ క్రీడలు: బీహార్ రాష్ట్రం పాట్నాలో ఈనెల 15 నుంచి 22 వరకు జరిగే స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అండర్–17 జాతీయ క్రికెట్ పోటీలకు జిల్లా కేంద్రానికి చెందిన విద్యార్థి మోసెస్‌రాజ్ ఎంపికయ్యారు. స్థానిక ఫాతిమా విద్యాలయంలో ఈయన 9వ తరగతి చదువుతున్నాడు. జాతీయ క్రికెట్ పోటీలకు ఎంపికైన విద్యార్థిని హెడ్ సిస్టర్ థెరిస్సా, పీఈటీ ప్రవీణ్ అభినందించారు. జాతీయస్థాయి పోటీల్లో ప్రతిభ చాటాలని కోరారు.

భార్య కాపురానికి రావడం లేదని.. ఉరేసుకుని భర్త ఆత్మహత్య

- సెల్ఫీ వీడియో చిత్రీకరణ

నవాబుపేట: భార్య కాపురానికి రాకపోవడంతో మనస్తాపానికి గురైన భర్త ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన నవాబ్‌పేట మండలం చెన్నారెడ్డిపల్లిలో చోటుచేసుకుంది. పోలీసుల వివరాల మేరకు.. చెన్నారెడ్డిపల్లికి చెందిన గొల్ల చిన్నా (41)కు హస్నాబాద్‌కు చెందిన శివలీలతో ఆరేళ్ల కిందట వివాహమైంది. వీరికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. కాగా రెండేళ్లుగా భార్యాభర్తల మధ్య గొడవలు చోటుచేసుకోవడంతో శివలీల పుట్టింటికి వెళ్లింది. ఆమెను ఇంటికి తీసుకొచ్చేందుకు పలుమార్లు యత్నించినప్పటికీ ఫలితం లేకపోయింది. కాగా.. తన భార్య కాపురానికి రాకపోవడానికి అత్త వెంకటమ్మ, మామ వెంకటయ్య కారణమని.. తాను బతికి లాభంలేదని.. ఆత్మహత్య చేసుకుంటున్నానని బుధవారం రాత్రి గొల్ల చిన్నా సెల్ఫీ వీడియో తీసుకున్నారు. అనంతరం ఇంట్లోనే ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి తల్లి శంకరమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఏఎస్‌ఐ ఆనంద్ తెలిపారు.

హైవేపై పాలట్యాంకర్ బీభత్సం


అలంపూర్ చౌరస్తా వద్ద ప్రమాదానికి కారణమైన పాల ట్యాంకర్


ట్యాంకర్ ఢీకొనడంతో డివైడర్‌పైకి ఎక్కిన స్లో మూవింగ్ వాహనం

- కూలీలను ఢీకొన్న ట్యాంకర్
- ఇద్దరి మృతి, మరో ఇద్దరికి తీవ్ర గాయాలు
- ఎక్కడికక్కడ నిలిచిన వాహనాలు


సీతారాముడు (ఫైల్)


రమేష్(ఫైల్)

అలంపూర్: పొట్టకూటి కోసం హైవే పనులకు వచ్చిన కూలీలను పాల ట్యాంకర్ ప్రాణాలు తీసింది. ఈ ఘటన ఉండవెల్లి మండలం అలంపూర్ చౌరస్తా సమీపంలోని ఉత్తరాఫుడ్స్ కంపెనీ వద్ద గురువారం చోటు చేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాలు ఇలా.. అలంపూర్‌చౌరస్తా నుంచి టోల్ గేట్ మధ్య ఉన్న 44వ జాతీయ రహదారిలో హైవే క్లీనింగ్ పనులను కూలీలు చేపడుతున్నారు. రోజు వారీగా స్లో మూవింగ్ వాహనంతోపాటు పనులు చేసే ప్రదేశంలో సేఫ్టీ కోమ్స్ ఏర్పాటు చేసుకున్నారు. హైదరాబాద్ నుంచి మదనపల్లికి వెళ్తున్న విజయ పాల డెయిరీ చెందిన ట్యాంకర్ స్లో మూవింగ్ వాహనాన్ని వెనుకభాగంలో బలంగా ఢీకొంది. దీంతో ఆ వాహనం ముందు పని చేస్తున్న వారిని ఢీకొని డివైడర్‌పైకి ఎక్కింది. ఈ ప్రమాదంలో ఉండవెల్లికి చెందిన రమేష్, పుల్లూరుకు చెందిన మంగలి సీతారాముడు, అమరవాయికి చెందిన సుధాకర్, కల్లూరుకు చెందిన లక్ష్మీదేవికి తీవ్ర గాయాలయ్యాయి. గాయపడిని వారిని హుటాహుటిని అంబులెన్స్‌లో కర్నూల్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అప్పటికే రమేష్(31) చెందాడు. చికిత్స పొందుతూ మంగలి సీతరాముడు(48) మృతి చెందగా, మరో ఇద్దరు చికిత్స పొందుతున్నారు. మృతుడు రమేష్‌కు భార్య, ముగ్గురు సంతానం, మంగలి సీతారాముడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు.

నిలిచిన వాహనాలు

జాతీయరహదారిపై ప్రమాదం కావడంతో అదే మార్గంలో వస్తున్న వాహనాలు ముందుకు వెళ్లడానికి మార్గం లేక నిలిచిపోయాయి. కొద్దిసేపటికి వాహనాలు బారులు తీరాయి. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు ప్రమాదానికి గురైన వాహనాలు పక్కకు జరిపి ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు.


నిలిచిపోయిన ట్రాఫిక్

ఎన్టీఆర్ కాల్వకు 30 క్యూసెక్కుల నీటి విడుదల

మదనాపురం: మండలంలోని రామన్‌పాడు జలాశయంలో గురువారం పూర్తి నీటిమట్టం 1,020 అడుగులకు నిలకడగా కొనసాగుతుంది. జూరాల ఎడమ కాల్వ ద్వారా, సమాంతర కాల్వ ద్వారా నీటిని నిలిపివేశారు. ఎన్టీఆర్ కాల్వ ద్వారా 30 క్యూసెక్కులు, తాగునీటి అవసరాల కోసం 20 క్యూసెక్కుల నీటిని వినియోగిస్తున్నామని ఏఈ సింగిరెడ్డి రనీల్‌రెడ్డి తెలియజేశారు.

డబుల్‌బెడ్రూం ఇళ్ల కోసం ఆందోళన


డబుల్‌బెడ్రూం ఇళ్ల వద్ద ఆందోళన చేపట్టిన మహిళలు

జడ్చర్ల: జడ్చర్ల పట్టణంలోని ఎర్రగుట్ట ప్రాంతంలో నిర్మించిన డబుల్‌బెడ్రూం ఇళ్ల కోసం పలువురు మహిళలు గురువారం పెద్దఎత్తున ఆందోళన చేపట్టారు. ఇక్కడ నిర్మించిన దాదాపు 600 డబుల్‌బెడ్రూం ఇళ్లను అర్హులైన లబ్ధిదారులకు పంపిణీ చేయాల్సి ఉండగా.. ఈ ప్రక్రియ సజావుగా సాగలేదు. బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో అప్పటి మంత్రి కేటీఆర్ డబుల్‌బెడ్రూం ఇళ్లను ప్రారంభించి.. కేవలం 8మందికి మాత్రమే పట్టాలిచ్చి వెళ్లిపోయారు. అనంతరం అప్పటి ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి అర్హులను గుర్తించేందుకుగాను పట్టణంలోని పలు కాలనీల్లో స్వయంగా పర్యటించి, ఇళ్లను కేటాయించే విధంగా చర్యలు చేపట్టారు. అయితే ఎన్నికల నోటిఫికేషన్ రావడంతో ఇళ్ల కేటాయింపు ప్రక్రియ నిలిచిపోయింది. ఎన్నికల అనంతరం కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడటం, స్థానిక ఎమ్మెల్యేగా అనిరుధ్‌రెడ్డి గెలుపొందడంతో పరిస్థితులు తారుమారయ్యాయి. దీంతో నివాసగృహాలు లేని పేదలు వివిధ పార్టీల ఆధ్వర్యంలో డబుల్‌బెడ్రూం ఇళ్లను స్వాధీన పర్చుకుని, అక్కడే నివాసముంటున్నారు. ఈ క్రమంలో బుధవారం స్థానిక తహసీల్దార్ తదితరులు అక్కడికి వెళ్లి డబుల్‌బెడ్రూం ఇళ్లను ఖాళీ చేయాలని సూచించారు. అంతేగాక తాగునీరు, విద్యుత్ సరఫరాను నిలిపివేయాలని ఆదేశించడంతో ఇళ్లను స్వాధీన పర్చుకున్న మహిళలు ఆందోళన చేపట్టారు. తాము ఉంటున్న ఇళ్లను తమకే ఇవ్వాలని కోరారు. కొన్నేళ్లుగా సొంతిల్లు లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ఆవేదన వ్యక్తం చేశారు.

పేకాట స్థావరంపై పోలీసుల దాడులు

- 18 మంది అరెస్టు
- కారు, 17 బైక్‌లు, 19 సెల్‌ఫోన్ల స్వాధీనం
- రూ.4.8లక్షల నగదు స్వాధీనం


జాంపల్లి శివారులో పోలీసులకు పట్టుబడిన పేకట రాయుళ్లు

ధరూరు: పేకాట స్థావరంపై పోలీసులు మెరుపు దాడులు చేశారు. విశ్వసనీయ సమాచారం మేరకు ఎస్పీ ఇన్‌స్పెక్టర్ భగవంత్‌రెడ్డి, ఎస్‌ఐ శివానందంగౌడ్ జోగుళాంబ గద్వాల జిల్లా ధరూరు మండలంలోని జాంపల్లి శివారు ధరూరు గట్టు వెనక ఏకకాలంలో పోలీసులు దాడులు నిర్వహించి 18 మందిని అరెస్టు చేశారు. వారి నుంచి రూ.4.8లక్షల నగదును స్వాధీనం చేసుకున్నారు. మండలంలోని ఆయా గ్రామాలతో పాటు గద్వాల, మహబూబ్‌నగర్‌కు చెందిన పేకాట రాయుళ్ల నుంచి కారు, 19 సెల్ ఫోన్లు, 17 ద్విచక్రవాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. పట్టుబడిన వారిలో జమల్ సింగ్ (గద్వాల), కృష్ణ (మహమూబ్‌నగర్), వెంకటేశ్వర్లు (దౌదర్‌పల్లి), గొల్ల రమేష్ (దౌదర్‌పల్లి), లక్ష్మన్న (ఉలిగేపల్లి), గోపాల్ (జాంపల్లి), కర్రెన్న (పారుచర్ల), శివరాజ్, చంద్రన్న (గద్వాల), వెంకట్రాములు (గద్వాల, గంజిపేట), పాంటప్ప (ఆత్మూరు కర్ణాటక), గణపతి (జాంపల్లి), చెన్నయ్య (జాంపల్లి), నూర్ అహ్మద్ (నందిన్నె), కర్రెప్ప (ఉప్పేరు), గోపాల్ (దౌదర్‌పల్లి), రంగారెడ్డి (ఉలిగేపల్లి), గుంత గోపాల్ (పారుచర్ల) తదితరులు ఉన్నారు.